ముందు వాళ్ళల్లో ఒకాయన నవ్వాడు. తరువాత అందరూ నవ్వేరు.

"విశ్వం సంగతి మీకు తెలీదుటండీ? వాడక్కడ ఒక మిల్లులో ఫిట్టర్‌గా పనిచేస్తున్నాడు."

నామిత్రుడు తెల్లబోయాడు.

"నిజమే?"

"ఓ...అక్షరాలా వాళ్ళనాన్నని అడగండి కావస్తే."

"పోనీండి...నేను మాత్రం దాని మాటలు నమ్మి ఇచ్చానంటూరా ఏమిటి?"

"వాడిమాట లెవ్వరూనమ్మరు!"

"అంతే...ఏదో అవసరంలో ఉన్నాడు. మన ఊరువాడు. సరే అన్నాను. ఇంతకీ నాకు పరాయివాడా? ఇచ్చిందిమాత్రం ఏపాటి!"

"అబ్బే...అంతే!"

క్లబ్బుకి వెళ్ళినప్పుడల్లా పెద్దమనిషి మిత్రులలో తరచు విశ్వాన్ని తిడుతూనే మాట్లాడుతూ ఉండేవాడు. "వాడు వట్టి మోసగాడేనండీ! నాకు తెలీదు గనకనా!...అయినా ఎంతో అవస్థలో ఉంటే ఎందుకు సాయం చెయ్యకపోవాలి? అని ఇచ్చాను..."

ఈ ధోరణిలో సాగేది సంభాషణ.

నవ్వుకొనేవాడిని.

రాఘవరావు మా వూరు పోస్టాఫీసులో గుమాస్తా. సాయంత్రం అతన్నోసారి కలుసుకుందామని ఆఫీసువైపు వెళ్ళాను. మనీఆర్డర్లు రిసీవయినవి లెక్క వేసుకుంటున్నాడు. కూర్చున్నాను.

"ఈఫిగర్స్ ఓసారి డిక్టేట్ చెయ్ భాయ్ కిట్టడం లేదు" అంటూ మనిఆర్డరు ఫారాలు ఇచ్చాడు.

వరుసని చెప్తూంటే ఒక మొత్తం ఎందుకో కొంచెం పరిచితంగా కనిపించింది, 316-8-0.

జ్ఞాపకంవచ్చింది త్వరగా చూశాను.

"వి. విశ్వం, ఫిట్టర్-ఆర్. సి. వర్క్ షాప్."

ఆ పెద్దమనిషిదే అడ్రస్. క్రింది అడ్రస్ కూడా చూశాను. మిత్రుడికి క్షమాపణ చెప్పి కూపన్‌లో వ్రాసినది చదివేను.

"బాబాయ్! నీదగ్గర నాటకం ఆడానని నీకు తెలిసే ఉంటుంది-నా ఉద్యోగం సంగతి. కాని, నిజంచెప్తే నా అవసరం తీరదని నాకు తెల్సును. అందుకే అబద్ధం ఆడాల్సొచ్చింది. క్షమించు. డబ్బుపంపడం కొంచెం ఆలస్యం అయినందుకూ క్షమించు—విశ్వం."

నాకు ఏదో చిత్రమైన గౌరవం కలిగింది విశ్వం అంటే. ఇటుపైని అతని మంచితనం వీరందరూ తెల్సుకుంటారని అనుకున్నాను.

మర్నాడు మనీ ఆర్డర్ పేమెంట్ అయింది. కాని, ఆ సాయంత్రం క్లబ్బులో ఆయన విశ్వాన్ని మామూలుగానే తిట్టాడు. తరువాత చాలా సాయంకాలాలు మిత్రులతో ఆయన గడుపుతూన్నప్పుడు, విశ్వం విషయం వొచ్చినప్పుడల్లా ఆయన విశ్వాన్ని తిడుతూనే ఉన్నాడు.

ఆయన పెద్దమనిషి, విశ్వాన్ని తిడుతూన్న వాళ్ళందరూ పెద్దమనుషులు...అదిమాత్రం నిజం-వాళ్ళందరూ విశ్వాన్ని "ఫూల్" అంటారు.

అదీ నిజమేననిపిస్తూంటుంది—అప్పుడప్పుడు!

---

స్కెచ్

# స్మృతిపథంలో జామిచెట్టు

న. రా. శివస్వామి

జామిచెట్టు! - పచ్చగా చల్లగా, చెట్టు ఎంతో నిండుగా వుండేది. తులసికోట పక్కని కొంచెం ఏటవాలుగా, ఠీవిగా నిలబడి జామిచెట్టు పెరటికెంతో శోభని చేకూర్చుతూ ఉండేది. గుబురుగావున్న ఆకులు - ఆకులమరుగున ఉన్న పిందెలు, కాయలు-చిలుకకొట్టు పళ్లు-ఉదయాస్తమయాల్లో చెట్టునాశ్రయంగా చేసికొని కిలకిలారావాలుచేసే పక్షులు - అన్నీ ఎంత అందంగా ఉండేవి!

* * *

"చెల్లీ నాకు రెండు కాయలు దొరికేయే."

"నాకైతే మంచి చిలక్కొట్టుపండు దొరికింది!"

"నాకోముక్కి-య్యవ్?"

"అబ్బా! నీకురెండున్నాయి"

"నాదగ్గిరిది నీకొకటిచ్చేస్తాను. నాకోముక్కిస్తావా?"

ఇలాగ రామం, రామంచెల్లి లక్ష్మి వాదులాడుతూ ఉంటే "ఏమర్రా పరగడుపుని జామికాయలు తింటారేమిటి? పదండి చద్దన్నాలు పెడతాను" అని గట్టిగా వాళ్ళమ్మ కేకలేసేది. అన్నాచెల్లెళ్ళిద్దరూ పంపకాలు పరిష్కరించుకొని అన్నాలకి పరుగెత్తేవారు. రామానికప్పటికి పదేళ్ళు. అప్పుడు ఫస్టుఫారం గాబోలు చదువుతూండేవాడు.

*     *     *

"ఏమిరా రామం తెల్లవారిందీ జామి చెట్టెక్కి కటుకు కాయలు తినడానికి? నిన్నరాత్రి వర్షం కూడా పడ్డాది. జారుగా వుంటుంది దిగరా" అని నట్టింట్లో పూజచేసుకుంటూన్న అమ్మ కేక వేసేది. రామం-రాగంతీస్తూ-"చిత్తశుద్ధిలేని శివ పూజలేలయా...ఓం కేశవాయస్వాహా రామం చెట్టుదిగూ, నారాయణాయస్వాహా సూరీ బజారుకింకా వెళ్ళలేదూ? మాధవా ఏమే గిన్నెలుతోమి పెట్టేవూ." అమ్మ—"ఏంట్రా వేళాకోళాలూ నువ్వూనూ తప్పు" రామం—"లేదమ్మా, ఒట్టినే అన్నాను" అంటూ చెట్టుదిగి గదిలోకి పోయేవాడు నవ్వుకుంటూ.

*     *     *

కాలేజీలో చేరినతరువాత రామం యింటికి రావడం ఇది రెండోసారి. మొదట అన్నయ్య పెళ్ళికివచ్చి, పెళ్ళి అయిపోగానే వెళ్ళిపోయేడు. ఇప్పుడు సెలవలకొచ్చేడు. ఇంక రెండురోజులు మాత్రం సెలవులున్నాయి.

"ఏం మరిదీ, కాలేజీలో చేరినా, ఇంకా చెట్టెక్కడం కరడా పోలేదే" అన్నది వదిన లక్ష్మమ్మ పొద్దుటే జామికాయలేరి తింటున్న రామంతో.

"వాడెప్పటికీ ఒక్కలాగున్నాడు. ఎప్పుడు పెద్దవాడౌతాడో ఏమిటోనమ్మా!" అంది చీడీలో నున్న అమ్మ.

"రేపేకదా అమ్మా! వెళ్ళిపోతాను. ఆ వూళ్ళో మరి ఎలాగూ ఏ చెట్లూ ఎక్కడానికిలేవు. ఆఖరి సారి మన చెట్టు జామికాయలు తిందామని—" అని చెట్టు పలవమీద నిలబడి సమాధానం చెప్పేడు రామం.

*     *     *

కాలచక్రం గిర్రున తిరిగింది. ఒకనాడు రామం వరాండాలో కుర్చీలోకూర్చొని ఏదో రాసుకుంటూఉండగా భార్య వరహాలువచ్చి "ఏమిటండీ ఇంకా ఆలోచనేనా? ఎందుకు చెప్తున్నానో ఆమాత్రం పట్టించుకోకపోతే ఎలాగ? ఇప్పుడు వీడుచెయ్యి విరుచుకున్నాడు. రేపాచిన్నవాడు చెట్టెక్కి కాలో చెయ్యో విరుచుకుంటాడు. వేగిరం అప్పడినో, వీరయ్యనోపిల్చి చెట్టు కొట్టించెయ్యండి" అన్నది ఏకధోరణిలో. ఇది అప్పుడే ఏ పదోసారో అనడం!

రామం కాలేజీచదువు పూర్తిచేసిన తరువాత ఎన్నిమార్పులో జరిగేయి-తనకి వరహాలుతో పెళ్ళి అయింది - అమ్మచనిపోయింది - అన్నయ్యకింకో వూళ్ళో ఉద్యోగం దొరికితే కుటుంబంతో వెళ్ళి అక్కడే స్థిరపడిపోయేడు - తనకిద్దరు పిల్లలు, మోహన్, వేణూ-తనకి స్వస్థలంలో నే హైస్కూల్లో మాస్టరుద్యోగం దొరికింది. స్వంత యింట్లో కాలక్షేపంచేస్తున్నాడు. కిందటిరోజున మోహన్ చెట్టెక్కి పడిపోయి చెయ్యి విరుచుకున్నాడు. తను డాక్టరుదగ్గరికి జట్కాలో తీసికెళ్ళి బేండేజ్ కట్టించేడు. ఇంక అదిమొదలు భార్య వరహాలు మంకుపట్టుపట్టింది జామిచెట్టు నరికించమని. మోహన్ చెయ్యి విరుచుకుంటే చెట్టుదిమోసమా? దానికంతటిశిక్షా? రామానికెంత మాత్రం ఇష్టంలేదు చెట్టుకొట్టించడం. కొంత వరకూ భార్యని ప్రతిఘటించేడు- నచ్చచెప్పేడు- అబ్బే! వింటేనా ఆవిడ?

వరహాలు మర్నాడు పొద్దున్నే అప్పడిని పిలిపించి చెప్పింది, "మొదలంటా కొట్టే"మని.

పచ్చని ఆకులతో, విచ్చిన పువ్వులతో, పలకబారిన కాయలతో, చిలకలు కొరికిన పళ్ళతో, మంచి గంధపు చెక్కలాంటి మ్రానుతో, ఎన్నో పక్షులకి నివాసం అయిన ఆ జామిచెట్టు నిరాధారంగా భూదేవి ఒళ్ళోపడిపోయింది. రామం నిశ్చలనిర్లిప్తభావంతో ఆ పడిపోయిన చెట్టునుచూస్తూ నిలబడిపోయేడు.

"అమ్మయ్య!" అనుకుంది వరహాలు.